ఈనాడు
చిత్తూరు
శుక్రవారం అక్టోబరు 11, 2024

జలవనరుల శాఖలో ఇద్దరు ఏఈలకు బదిలీ


చిత్తూరు(మిట్టూరు): జిల్లా జల వనరుల శాఖలో ఇద్దరు ఏఈలు బదిలీ అయ్యారు. తవణంపల్లెలో పనిచేస్తున్న శబరీష్‌ను చిత్తూరు సీడబ్ల్యూఎస్‌ఎస్-1 విభాగానికి, తిరుపతిలో పనిచేస్తున్న మూర్తిని చిత్తూరు సీడబ్ల్యూఎస్‌ఎస్-2 విభాగానికి బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్‌ఎస్‌డీ టోకెన్లు లేకుండా గురువారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 12 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. బుధవారం శ్రీవారిని 79,753 మంది దర్శించుకోగా రూ.3.48 కోట్ల హుండీ కానుకలు లభించాయి.







ఆచంద్రార్కం.. శ్రీపతి దివ్యతేజం









తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు గురువారం ఉదయం శ్రీమలయప్ప స్వామి బద్రీ నారాయణుడి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉదయం వాహన మండపం నుంచి మాడవీధిలోని శ్రీవారి ఆలయం వద్దకు చేరుకోగానే చిరుజల్లులు ప్రారంభం కావడంతో స్వామివారి వాహనాన్ని ఘాటాటోపం కింద ఊరేగించారు.

రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్ప స్వామి చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకారంలో అభయప్రదానం చేశారు.

నేడు రథోత్సవం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7.00 గంటలకు శ్రీవారి రథోత్సవం ప్రారంభమవుతుంది. రాత్రి అశ్వ వాహనంపై శ్రీమలయప్ప స్వామి ఊరేగనున్నారు.

ఆయన భక్త ఈయన సేవా సులభుడు





◆ తితిదేకు టీసీఎస్.. తిరుపతికి స్వీకార్ తోడ్పాటు ◆ రతన్ టాటా దాతృత్వానికి ప్రతీక

నైతిక విలువలే పునాదులు.. నాణ్యతలో రాజీపడని ధోరణి.. దేశహితమే పరమావధి.. ప్రజల్లో అచంచల విశ్వాసం పొందగలిగిన రూ.లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తూనే.. సేవా కార్యక్రమాలు భూరివిరాళాలతో తమ దాతృత్వాన్ని చాటుకున్నారు ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా(86). శ్రీవారి భక్తుడైన ఆయనకు తిరుమల, తిరుపతితో ప్రత్యేక అనుబంధం ఉంది. శ్రీవారి సేవలకు సాంకేతిక సొబగులు అద్దడంలో అండదండలు అందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తితిదేతో కలిసి అడుగులు వేశారు.

- ఈనాడు డిజిటల్, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి (వైద్యం), తిరుమల



రతన్ టాటాకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న అప్పటి తితిదే జేఈవో శ్రీనివాసరాజు, చిత్రంలో టాటాగ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ (పాతచిత్రం)

ఎనిమిదేళ్లుగా తితిదేకు టీసీఎస్ సేవలు



శ్రీవారి సేవలు ఆన్‌లైన్ సంతరించుకోవడంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)ది కీలకపాత్ర. తితిదేకు ఉచిత సాఫ్ట్‌వేర్ సేవలను అందించే ఒప్పందం ఓ మైలురాయి. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో పూర్వపు ఈవో సాంబశివరావు హయాంలో ఇది సాకారమైంది. దీని ద్వారా తితిదేకు అవసరమైన సాఫ్ట్‌వేర్ సేవలను, ఉద్యోగులను టీసీఎస్ సమకూర్చింది. ఆన్‌లైన్, కరెంట్ బుకింగ్‌లో టికెట్ల జారీ, గదుల కేటాయింపు, నగదు స్వీకరణ, చెల్లింపు వంటి అనేక సాఫ్ట్‌వేర్ సేవలను ఎనిమిదేళ్లుగా తితిదేకు అందిస్తోంది. ఏడాదికి సుమారు రూ.12 కోట్ల విలువచేసే సేవలను టీసీఎస్ అందించడం గమనార్హం. 2018లో నిజపాద దర్శన సేవలో శ్రీవారిని రతన్‌టాటా దర్శించుకున్నారు. ఆయనతోపాటు టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితరులు వెంట ఉన్నారు.

పింక్ బస్సుతో ముందస్తు పరీక్షలు



క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చని గుర్తించి పింక్ బస్సు సేవలను అందుబాటులోకి తెచ్చింది. నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు వెళ్లి క్యాన్సర్ ముందస్తు పరీక్షలు చేస్తున్నారు. బాధితుల్లో 70 శాతం మంది ఆలస్యంగా క్యాన్సర్‌ను గుర్తిస్తుండగా కేవలం 30 శాతంమంది మాత్రమే ప్రాథమిక దశలో గుర్తిస్తున్నారు. దీంతో లెవల్ 1, 2, 3 స్టేజ్ క్యాన్సర్ సెంటర్ల ద్వారా చికిత్స అందిస్తున్నారు. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

వైద్యసేవలు పొందిన రోగులు

ఏడాది	మొత్తం
2022	1500
2023	2400
2024 (సెప్టెంబరు వరకు)	2300



శ్రీసిటీ నమూనాను రతన్‌టాటాకు వివరిస్తున్న ఎండీ (పాతచిత్రం)

శ్రీసిటీతో టాటా అనుబంధం

శ్రీసిటీ(వరదయ్యపాలెం), న్యూస్‌టుడే: దేశంలో రెడీ-టు-ఈట్(ఆర్టీఈ) మార్కెట్‌లో రెండో అతిపెద్ద సంస్థగా పేరున్న టాటా స్మార్ట్ ఫుడ్ లిమిటెడ్(టీఎస్ఎఫ్ఎల్) పరిశ్రమ స్థాపనలో రతన్‌టాటా శ్రీసిటీని ఎంచుకున్నారు. శ్రీసిటీలోని క్రియా విశ్వవిద్యాలయం పాలక మండలిలో సలహాదారుగానూ ఉన్నారు. 2019 ఏప్రిల్ 16న రతన్‌టాటా శ్రీసిటీ సందర్శనకు వచ్చారు. అంతర్జాతీయ, జాతీయ పరిశ్రమలు ఒకేచోట ఉన్న శ్రీసిటీ ప్రణాళిక, ప్రగతిని రతన్‌టాటా ఆ సమయంలోనే అభినందించారు. శ్రీసిటీతో రతన్‌టాటాకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా డా. రవీంద్రసన్నారెడ్డి గుర్తుచేసుకున్నారు.



క్యాన్సర్ ఆస్పత్రికి భూమిపూజ చేస్తున్న చంద్రబాబు, రతన్‌టాటా

స్వీకార్‌కు శ్రీకారం

అత్యంత ప్రాణాంతకమైన క్యాన్సర్ నుంచి పేద ప్రజలను కాపాడేందుకు ఆధునాతన వైద్య సేవలను టాటా ట్రస్టు అందుబాటులోకి తెచ్చింది. శ్రీవారి పాదాల చెంత (తిరుపతి జూపార్కు రోడ్డులో) తితిదే 25 ఎకరాల స్థలం కేటాయించగా రూ.250 కోట్ల వ్యయంతో శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ (స్వీకార్)ను ఏర్పాటు చేసింది. దేశ ప్రజలను క్యాన్సర్ బారి నుంచి కాపాడాలని భావించిన టాటా ట్రస్టు దేశంలో ఐదుచోట్ల రూ.1800 కోట్ల వ్యయంతో క్యాన్సర్ ఆస్పత్రులకు శ్రీకారం చుట్టింది. విషయం తెలిసిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశం కల్పించాలని కోరడంతో తిరుపతిలో క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటుకు ముందుకొచ్చింది. నామమాత్రపు లీజుతో తితిదే విలువైన స్థలాన్ని టాటా ట్రస్టుకు కేటాయించింది. 2018 ఆగస్టు 31న స్వీకార్‌కు సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి రతన్ టాటా భూమిపూజ చేశారు.




తిరుపతిలోని టాటా క్యాన్సర్ ఆస్పత్రి

రాయలసీమకు వరంలా..

ప్రారంభంలో పది పడకలతో కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకురాగా ప్రస్తుతం వంద పడకల ఆస్పత్రిగా సేవలందిస్తోంది. ఓపీల సంఖ్య 300కు చేరింది. నెలకు 1,100 వరకు కీమోలు, రోజూ 85 మందికి రేడియోథెరపీ, ప్రతినెలా సరాసరి 130 మేజర్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రజలకు టాటా క్యాన్సర్ ఆస్పత్రి ఓ వరంగా నిలిచింది.

బాధ్యతల స్వీకరణ



కేవీ రాఘవులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా కేవీ రాఘవులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో పశుసంవర్ధక శాఖ గెజిటెడ్ మేనేజర్‌గా ఉన్న ఆయన.. డిప్యూటేషన్ బదిలీపై జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా నియమితులయ్యారు. జిల్లాలో గతంలో పనిచేసిన విజయశంకర్‌రెడ్డి.. మాతృశాఖలో రిపోర్టు చేసుకున్నారు. కేవీ రాఘవులు మాట్లాడుతూ మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు. ప్రధానంగా పింఛను సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి దక్కాల్సిన సంక్షేమం, పిల్లలకు ఉపకార వేతనాలు, మాజీ సైనికులకు ఉద్యోగ అవకాశాలు.. ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేస్తామని పేర్కొన్నారు.

గంటా మోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గంటా మోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. స్థానిక ఎన్జీవో భవనంలో గురువారం వారు సమావేశం నిర్వహించగా ఐకాస జిల్లా ఛైర్మన్ మద్దతు ప్రకటించారు. నాయకులు మాట్లాడుతూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నించడం సంఘం నాయకుల బాధ్యత అని, నాయకులకు కనీస గౌరవం ఇవ్వకుండా డీఈవో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయకపోతే శుక్రవారం మెరుపు ఆందోళన చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం డీఈవో దేవరాజును.. ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిశారు. ఉపాధ్యాయులంటే తనకు గౌరవం ఉందని సస్పెన్షన్ ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన తాత్కాలికంగా వాయిదా వేసినట్లు నాయకులు ప్రకటించారు. ఐక్యవేదిక నాయకులు చెంగల్రాయ మందడి, జీవీరమణ, మునాఫ్, మదన్‌మోహన్‌రెడ్డి, గోపీనాథ్, మునీర్ అహ్మద్, కిరణ్‌కుమార్, మోహన్‌యాదవ్, మధు, యువరాజు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చిత్తూరు (వ్యవసాయం): మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉందని, అప్రమత్తమై మెరుగైన వైద్యసేవలందించాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ ఆదేశించారు. స్థానిక జేడీ కార్యాలయంలో గురువారం మండల పశువైద్యాధికారులతో సమీక్షించారు. పశువైద్యాధికారులు, సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. పశువులు, గొర్రెలు, మేకలకు నిర్దేశిత లక్ష్యం ప్రకారం వ్యాధి నిరోధక టీకా వేయాలని, లబ్ధిదారుల గోకులం దరఖాస్తులు వెంటనే తమకు అందజేయాలన్నారు. అర్హులైన పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ, రుణాల మంజూరుకు చొరవ చూపాలన్నారు. డీడీలు గోవిందయ్య, ఆరిఫ్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

14న కుప్పానికి నారా భువనేశ్వరి రాక

నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటన

కుప్పం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడి సతీమణి ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి ఈ నెల 14 నుంచి నాలుగు రోజుల పాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ దఫా నాలుగు మండలాలతో పాటు పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలంలోనూ ఆమె పర్యటిస్తారు. ఆ వివరాలను స్థానికులు తెలిపారు. 14న సోమవారం ఉదయం హైదరాబాదు నుంచి విమానంలో బెంగళూరు చేరుకుంటారు. ఆపై రోడ్డుమార్గంలో వి.కోట మండలం వచ్చి.. ఎన్టీఆర్ ట్రస్టు సుజల తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారు. తర్వాత శాంతిపురంలో మహిళలతో సమావేశమవుతారు. మొరసనపల్లెలో మహిళలతో ముఖాముఖి, కడపల్లె వద్ద నివాస భవనం నిర్మాణం పరిశీలన ఉంటాయి. 15న కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద వినతులు స్వీకరిస్తారు. గుడుపల్లె మండలం నలగాంపల్లె పర్యటన, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి ఉంటాయి. రామకుప్పం మండలం మొద్దులంక, గాంధీనగరంలో పర్యటిస్తారు. 16న ఉదయం కుప్పం బీసీఎన్ కల్యాణ మండపంలో జరిగే ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం సత్కార కార్యక్రమంలో పాల్గొంటారు. ఆపై వానగుట్టపల్లె, గుండ్లమడుగు, కొటాలూరు గ్రామాల్లో పర్యటిస్తారు. కుప్పంలో డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 17న ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వాల్మీకీ జయంతి సభలో పాల్గొంటారు. ట్రైసైకిళ్లు, తోపుడు బండ్లు ట్రస్టు తరఫున పంపిణీ చేస్తారు.

అప్పుడే కిక్కెక్కిస్తున్నారు..!

◆ సరిహద్దుల్లో పెరిగిన డిమాండ్
◆ 104 మద్యం దుకాణాలకు 1,749 దరఖాస్తులు



పుత్తూరు ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాసుదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయకుమార్

చిత్తూరు (నేరవార్తలు), పుత్తూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి వ్యాపారులు ఎగబడుతున్నారు. దరఖాస్తు గడువు పొడిగించడంతో కొందరు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి దరఖాస్తు చేస్తున్నారు. 104 మద్యం దుకాణాలకు గురువారం నాటికి 1,749 దరఖాస్తులు అందగా.. వాటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.34.98 కోట్ల ఆదాయం సమకూరింది. శుక్రవారం ఆఖరురోజు కావడంతో మరింత మంది ముందుకురానున్నారు. దరఖాస్తులు రెండు వేలు దాటి, ఆదాయం రూ.40 కోట్లకు పైగా రానున్నదని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా దరఖాస్తులు రావడంతో అధికారులు ఆశ్చర్యపోతున్నారు.. అయితే కొన్నింటికి పది దరఖాస్తులు కూడా రాలేదు. 25 దుకాణాలకు తొమ్మిది లోపే అందగా, రొంపిచెర్లలోని రెండింటికి 3, 4 దరఖాస్తులు అందాయి.

సరిహద్దు దుకాణాలకు పోటీ..

తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఇటు తమిళనాడు, అటు కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దున ఉన్న దుకాణాలకు పోటీ అధికంగా ఉంది. చిత్తూరు జిల్లాలో నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, కుప్పం నియోజకవర్గాలు తమిళనాడుకు సరిహద్దున ఉన్నాయి. పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలు కర్ణాటకకు సరిహద్దులో ఉన్నాయి. సరిహద్దులో ఉన్న దుకాణాలకు పోటీపడి దరఖాస్తు చేశారు. విజయపురంలో 4 దుకాణాలకు 102 దరఖాస్తులు రాగా.. అందులో దుకాణం నం.59కి అత్యధికంగా 31 రావడం గమనార్హం. జీడీనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరంలో దుకాణం నం.43కు 20 దరఖాస్తులు వచ్చాయి. ఎస్‌ఆర్‌పురంలో రెండు దుకాణాలకు 33, వెదురుకుప్పంలో రెండింటికి 41 దరఖాస్తులు వేశారు.

చిత్తూరులో పోటీ ఎక్కువ..

జిల్లాలోని 104 దుకాణాలతో పోలిస్తే చిత్తూరు ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలోని 41 దుకాణాలకు పోటీ ఎక్కువ. రాజకీయ నాయకులతో పాటు వైకాపా నాయకులు, పొరుగు రాష్ట్ర వ్యాపారులు పోటీపడుతున్నారు. కార్వేటినగరం స్టేషన్ పరిధిలోని 8 దుకాణాలకు 218, నగరి స్టేషన్ పరిధిలోని 11 దుకాణాలకు 174, పుంగనూరు పరిధిలోని 14 దుకాణాలకు 116, పలమనేరు పరిధిలోని 13 దుకాణాలకు 150, కుప్పం పరిధిలోని 10 దుకాణాలకు 276, పులిచెర్ల పరిధిలోని 7 దుకాణాలకు 52 దరఖాస్తులు అందితే.. చిత్తూరు అర్బన్, రూరల్ స్టేషన్‌ల పరిధిలో 41 దుకాణాలకు 781 దరఖాస్తులు అందాయి. చిత్తూరు పరిధిలోని దుకాణాలకు వచ్చిన దరఖాస్తులతోనే ప్రభుత్వానికి రూ.15.62 కోట్లు ఆదాయం సమకూరింది.

పాలసముద్రం దుకాణానికి 62 దరఖాస్తులు..

జీడీనెల్లూరు నియోజకవర్గంలోని పాలసముద్రం దుకాణానికి భారీ పోటీ పెరిగింది. దుకాణం సరిహద్దు ప్రాంతాల్లో ఉండటం, స్థానికులే కాకుండా తమిళనాడు రాష్ట్రం వారు సైతం గురువారం నాటికి 62 మంది దరఖాస్తు చేశారు. వీటి ద్వారా రూ.1.24 కోట్లు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణంలో రోజుకు రూ.4లక్షల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. పండగరోజు మరో రూ.2లక్షల మేర విక్రయాలు అదనం. వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లంలో దుకాణం రోజుకు వ్యాపారం రూ.3.5 లక్షలు జరుగుతుంది. దీంతో ఇక్కడా పోటీ నెలకొంది.

తిరుపతి జిల్లాలో ఇలా..

తిరుపతి జిల్లాల్లోని తూర్పు మండలాల్లో గత రెండ్రోజుల క్రితం వరకు నేతల కనుసన్నల్లో దరఖాస్తులు పడ్డాయి. అయితే దీనిపై ప్రభుత్వం ఆరా తీయడంతో కొందరు నేతలు వెనక్కు తగ్గారు. ఈ నేపథ్యంలో తూర్పు మండలాల్లో సైతం గత రెండ్రోజులుగా భారీగా దరఖాస్తులు రావడం గమనార్హం.

బాలాత్రిపురసుందరదేవిగా మరగదాంబిక



కాణిపాకం: బాలత్రిపుసుందరిదేవిగా మరగదాంబిక అమ్మవారు ◆ బంగారుపాళ్యం: దుర్గాదేవిగా బోయకొండ గంగమ్మ

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ మరగదాంబిక సమేత శ్రీ మణికంఠేశ్వరస్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం రాత్రి అమ్మవారు బాలత్రిపురసుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూలవిగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి, భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు, భక్తులు పాల్గొన్నారు. ◆ **బంగారుపాళ్యం..** మండలంలోని బోయకొండపై వెలసిన గంగమ్మ తల్లి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి.

దుర్గాదేవిగా బోయకొండ గంగమ్మ



దుర్గాదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ

బోయకొండ (చౌడేపల్లె), న్యూస్‌టుడే: దసరా మహోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ అభయమిచ్చారు. ఉభయదారుల సహకారంతో ఆలయ అర్చకులు యర్రరంగు చీర, త్రిశూలం, కత్తి ఆయుధాలతో అమ్మవారికి అలంకారం చేశారు. యాగశాలలో హోమం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా డీపీవో ధనలక్ష్మి, ఈవో ఏకాంబరం పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి చెస్ పోటీలు

పుంగనూరు గ్రామీణ, న్యూటుడే: జిల్లాస్థాయి చెస్ పోటీలు స్థానిక మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు గురుకులం ఆచార్య మణికంఠ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. అండర్-15 బాలికలు, ఓపెన్ కేటగిరిలో ఉంటాయన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్బీ ప్రసాద్ విజేతలకు బహుమతులు అందిస్తారని తెలిపారు. విజేతలు నలుగురు ఈ నెల 15, 16, 17 తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటున్నట్లు చెప్పారు.

పారదర్శకంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయకుమార్

పుత్తూరు, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీ విధానం ద్వారా పారదర్శకంగా దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చిత్తూరు జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ విజయకుమార్ పేర్కొన్నారు. పుత్తూరు ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో 104, తిరుపతి జిల్లాలో 227 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. రెండు జిల్లాల్లోనూ దుకాణాలకు స్పందన బాగుందన్నారు. తమ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, 24 గంటలు తమ సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారన్నారు. పుత్తూరు సర్కిల్ పరిధిలో 18 దుకాణాలకు 132 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మహిళా దరఖాస్తుదారులు ఎక్కువ మంది ఉన్నారని, 14న తిరుపతి శిల్పారామంలో తిరుపతి జిల్లాకు సంబంధించి, చిత్తూరు సంతపేటలోని ఆర్‌ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో చిత్తూరు జిల్లా దుకాణాలకు డిప్ తీసి కేటాయిస్తామన్నారు. ఈ ప్రక్రియ అంతా కలెక్టర్ల సమక్షంలో జరుగుతుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ సుబ్రహ్మణ్యం, సీఐ మురళీమోహన్, ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఒత్తిడి జయించాలి



మాట్లాడుతున్న న్యూరో సైక్రియాటిస్ట్ డాక్టర్ శ్రీవస్త

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఉద్యోగాలు చేసే ప్రతిచోట ఒత్తిడి సహజమేనని, ఎంతటి ఒత్తిడి ఉన్నా జయించాలని చెన్నై అపోలో క్యాన్సర్ ఆస్పత్రి న్యూరో సైక్రియాటిస్ట్ డాక్టర్ శ్రీవస్త తెలిపారు. స్థానిక అపోలో విశ్వవిద్యాలయంలో శుక్రవారం రెండోరోజు 'పని స్థలంలో మానసిక ఆరోగ్యం'పై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఒత్తిడికి భయపడినా, జంకినా మానసికంగా కుంగిపోతామని, ఆరోగ్యం సైతం క్రమంగా క్షీణిస్తుందని హెచ్చరించారు. సమయ పాలన పాటిస్తూ, ప్రణాళికతో పనులు పూర్తిచేయాలని, అప్పుడే పనిభారం తగ్గుతుందని, ఒత్తిడి ఉండదన్నారు. ఒత్తిడి ఉన్నవారు రోజూ విధిగా యోగా, నడక, వ్యాయామం చేసి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. వైద్యులు విజయసాగర్, దిలీప్, నరేంద్రసింగ్, మధు భరద్వాజ్, శాంద్రా జుంబే పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమిదే



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పక్కనే ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, జేసీ విద్యాధరి

నగరి, న్యూస్‌టుడే: ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం అనడానికి ఈ ప్రజావేదికే నిదర్శనమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఆర్డీవో వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రజల నుంచి 228 వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించడానికి కలెక్టర్ రావడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. తాగునీటి సమస్య, సీసీరోడ్ల నిర్మాణానికి సంబంధించిన వినతులు ఎక్కువగా ఉన్నాయని, ఆయా పనులు వెంటనే చేపట్టనున్నామన్నారు. గతంలో అర్హులకు పింఛన్లు రాకుండా అడ్డుకున్నారని, కొందరివి తొలగించారని, వాటిని పరిష్కరిస్తామన్నారు. నేటమ్స్ షుగర్స్ రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అక్కడకు వచ్చిన రైతులతో కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపీపీ భార్గవి, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఏడీ గౌస్‌బాషా, ఇన్‌ఛార్జి జిల్లా వైద్యాధికారి వెంకటప్రసాద్, డీఎల్‌డీవో రవికుమార్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్

అసంపూర్తి టిడ్కో ఇళ్లు పూర్తి చేసి పంపిణీ

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి.. లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చదళ్ల చౌడేశ్వరి దేవి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిర్మాణంలోని, లబ్ధిదారులకు అందజేసిన ఇళ్లు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మౌలిక వసతుల కల్పన, నిర్మాణాలు పూర్తి చేయడానికి సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు తెస్తామన్నారు. భవిష్యత్తులో పుంగనూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఎన్వీఆర్ ట్రస్టు అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పగడాల రమణ, చిన్న, విరూపాక్షి పాల్గొన్నారు.

ఏఎస్పీల బదిలీ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: ఏఎస్పీలను బదిలీ చేసి పోస్టింగ్ ఇస్తూ గురువారం హోంశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ పీఏ సహాయ కమాండెంట్‌గా ఉన్న ఎం.ఎల్.మనోహర్‌కు ఉద్యోగోన్నతి కల్పించి చిత్తూరు ఏపీఎస్‌పీ ఎనిమిదో బెటాలియన్ అదనపు కమాండెంట్‌గా నియమించారు. తితిదే వీఎస్వోగా ఉన్న ఆర్.శివానంద కిషోర్‌కు ఉద్యోగోన్నతి కల్పించి చిత్తూరు జిల్లా ఏఆర్ ఏఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ఆ స్థానంలో ఉన్న జి.నాగేశ్వరరావును విజయనగరం ఏఆర్ ఏఎస్పీగా బదిలీ చేశారు.

రతన్ టాటా మరణం బాధాకరం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం, పద్మవిభూషణ్ రతన్ టాటా మరణం బాధాకరమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. టాటా చారిటబుల్ ట్రస్ట్‌లకు ఛైర్మన్‌గా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఆయన చేసిన ప్రజాసేవ ఎనలేనిదని కొనియాడారు. ఆయన మృతి దేశానికి, దేశ ప్రజలకు తీరని లోటని, ఆయన మృతిపై తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

కలికిరి వాసి మృతదేహం లభ్యం

సదుం, న్యూస్‌టుడే: కలికిరి వాసి మృతదేహం మండల పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టులో గురువారం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం, మర్రికుంటపల్లె పంచాయతీ వీరవాళ్లపల్లెకు చెందిన మర్రిపల్లె హరినాథ్ (47) ఈనెల 2న కొబ్బరికాయలు కోసే కూలికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని అతని సోదరుడు అక్టోబరు 6న కలికిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. విచారణలో భాగంగా ఫతేగడ పంచాయతీ కొత్తమాలపల్లెలో కొబ్బరికాయలు కోస్తుండగా హరినాథ్ కిందపడి మరణించారు. ఆటోడ్రైవర్ ఆరిఫ్ మరొకరితో కలిసి మృతదేహాన్ని సదుం-పీలేరు మార్గంలోని పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టు నీటిలో పడేసి వెళ్లినట్లు తేలింది. మృతదేహాన్ని వెలికితీసి వైద్యాధికారి అన్వేష్ పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

పాలమాకులపల్లెలో పట్టపగలే చోరీ

బంగారుపాళ్యం: మండలంలోని పాలమాకులపల్లెలో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... గ్రామానికి చెందిన ప్రమీళమ్మ గురువారం ఉదయం ఇంటికి తాళంవేసి వ్యవసాయ బావి వద్దకు పశువులను మేతకు తీసుకెళ్లింది. మధ్యాహ్నం రాగా ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించి ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి 75 గ్రాముల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుతో సీఐ సీసీ పుటేజీని పరిశీలించారు. గుర్తుతెలియని ఇద్దరు ఇంటి తాళాలను కట్టర్లతో కత్తరించి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

అన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న దామోదరన్ కుటుంబ సభ్యులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్న దాన పథకానికి తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఎన్.దామోదరన్ రూ.లక్ష మొత్తాన్ని ఆలయ ఈవో పి.గురుప్రసాద్‌కు గురువారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

బంగారుపాళ్యం,న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా కార్యాలయ ఏవో శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులను నిర్వహిస్తున్న ఎంపీడీవో శివశంకర్ అన్నమయ్య జిల్లా పీలేరు మండలానికి బదిలీపై వెళ్లారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: స్థానిక గిరింపేట బొండు వీధిలోని డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి **-స్థానికులు**

సమాధానం: కాలువల్లో పూడిక తొలగింపజేస్తాం.

-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: స్థానిక గొడుగుమూరులో డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. **-స్థానికులు**

సమాధానం: డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేపడతాం. **-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి: కలెక్టర్



అంబులెన్స్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భానుప్రకాష్, జేసీ విద్యాధరి

నగరి, న్యూస్‌టుడే: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో రూ.34 లక్షల తుడా నిధులతో నూతనంగా అందించిన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్స్‌ను.. కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గురువారం ప్రారంభించారు. ఈ అంబులెన్స్‌లో వెంటిలేటర్, ఆక్సిజన్ సరఫరా, ఇన్ఫ్యూజన్ పంప్ ఉంటాయని వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయన వారితో మాట్లాడారు. ఆసుపత్రికి అత్యవసరమైన మందులను ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఏరియా ఆసుపత్రిలో రోజుకు 200 దాకా ఓపి కేసులు వస్తున్నాయని, నెలకు 170 ప్రసవాలు చేస్తున్నామని, ఇతర సేవల వివరాలను సూపరింటెండెంట్ జరీనా బేగం కలెక్టర్‌కు వివరించారు. ఇన్‌ఛార్జి జిల్లా వైద్యాధికారి వెంకటప్రసాద్, డీసీహెచ్ఎస్ ప్రభావతి, వైద్యులు పాల్గొన్నారు.

పతకాలు గెలుస్తాం.. లక్ష్యం సాధిస్తాం

- నిత్య సాధనతో ముందుకు
- సత్తా చాటుతున్న యువ క్రీడాకారులు

న్యూస్‌టుడే, చిత్తూరు(క్రీడలు)



పట్టుపడితే సాధించే వరకూ వదలని నైజం యువత సొంతం.. విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొనే ఆత్మ విశ్వాసం, పోరాడే లక్షణం క్రీడల ద్వారా సిద్ధిస్తుంది.. క్రీడా ప్రతిభ ఉన్న ఈ యువత.. పోరాట పటిమతో క్రీడల్లో సత్తా చాటుతున్నారు. . జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పతకాలు సాధించారు.. భవిష్యత్‌లో తమ లక్ష్యాల్ని నెరవేర్చుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు ఆటగాళ్లు.

పోరాట పటిమతో..



చిత్తూరు నగరానికి చెందిన మోనీష్ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆత్మ రక్షణ క్రీడ తైక్వాండో అంటే అతడికి ఎంతో ఇష్టం. సినిమాల స్ఫూర్తితో కరాటేలో గత ఐదేళ్లుగా సాధన చేస్తున్నాడు. ఆట నేర్చుకునే తొలి రోజుల్లో అనేక దెబ్బలు తగిలాయి. అయినా ఏ మాత్రం భయపడక నిరంతర సాధన ద్వారా ప్రావీణ్యం సాధించాడు. నాలుగు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడ్డాడు. రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలు సునాయాసంగా కైవసం చేసుకున్నాడు. బ్లాక్‌బెల్ట్ సాధించడం తన జీవిత లక్ష్యమని.. కచ్చితంగా సాధిస్తానని ఆశాభావం వ్యకం చేస్తున్నాడు.

చక్కటి ఆటతీరు..



పలమనేరుకు చెందిన మమత.. డిగ్రీ చదువుతోంది. చదువుతోపాటు సహ పాఠ్యాంశాల్లో చురుకు. ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటోంది. గ్రామీణ క్రీడ కబడ్డీలో చక్కని ఆటతీరుతో భేష్ అనిపిస్తోంది. స్కూల్, ఇంటర్ జోనల్స్ స్థాయిలో పతకాల్ని సాధించి శభాష్ అనిపించింది. ఎస్సై కావాలన్న ఆశయాన్ని నెరవేర్చుకునేందుకు ఎన్‌సీసీ శిక్షణలో చేరి.. మాక్ డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచింది. జాతీయ సమైక్య శిబిరంలో పతకాన్ని సాధించి శభాష్ అనిపించింది.

కూతకెళితే పతకమే..



రాజు.. ఖోఖో ఆటగాడు. డిగ్రీ చదువుతున్నాడు. చిత్తూరు నగరం స్వస్థలం. రాజు చిన్ననాటి నుంచి ఆటల్లో చురుకు. పాఠశాల స్థాయి నుంచి ఖోఖో సాధన చేస్తూ నైపుణ్యం సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో తలపడి పతకాల్ని గెలిచాడు. 2019లో చిత్తూరులో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించాడు. ఈ పోటీల్లో జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవడంతో జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. ఇంకా అసోసియేషన్ మీట్‌లో రాష్ట్ర స్థాయిలో సత్తాచాటాడు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే ధ్యేయంగా సాధన చేస్తున్నాడు.

ప్రమాదకర భవనాన్ని తొలగిస్తాం

ఈనాడు కథనానికి స్పందన

పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న పాత పాఠశాల భవనాన్ని వెంటనే తొలగింపజేస్తామని ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన భవనంతో విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లల ప్రాణాలకు ముప్పు నెలకొంది. దీనిపై 'ఈనాడు'లో ఈ నెల 9న 'పసి ప్రాణాలతో చెలగాటమా..!' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంఈవో రాజేంద్రప్రసాద్ స్పందించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశులతో కలిసి గురువారం ఆ భవనాన్ని పరిశీలించారు. దాన్ని తొలగింపజేసేందుకు చర్యలు తీసుకుంటామని, అప్పటివరకు చిన్నారులు ఈ భవనం వద్దకు రాకుండా చూస్తామని పేర్కొన్నారు. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ

బంగారుపాళ్యం: తెదేపా మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, మాజీ ఎంపీపీ సుచిత్ర కుమారుడు పృధ్వీ పుట్టిన రోజును గురువారం ఎమ్మెల్యే మురళీమోహన్, నాయకులు, కార్యకర్తల నడుమ ఘనంగా నిర్వహించారు. భారీ కేకు కోసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. నల్లగాంపల్లె పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు అందించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జయచంద్రనాయుడు, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు కోకాప్రకాష్‌నాయుడు, రాష్ట్ర సర్పంచుల సంఘ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధి అవకాశాలే లక్ష్యం: ఎమ్మెల్యే

రూ.9.34 కోట్లతో 153 పనులు



జగన్మోహన్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో యువత, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో విస్తృతంగా ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామ స్థాయిలో యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించామన్నారు. మంత్రి నారా లోకేశ్ కృషి ఫలితంగా టాటా సంస్థ విశాఖలో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐటీ, పారిశ్రామిక రంగానికి మంచి రోజులు వచ్చాయని, ఫలితంగా ఐటీ సంస్థలు, పారిశ్రామిక వేత్తలు ఏపీ వైపు వస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఈ నెల 14 నుంచి పల్లె పండగ నిర్వహిస్తున్నామని, పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. చిత్తూరు గ్రామీణ, గుడిపాల మండలాల్లో ఇప్పటికే గ్రామసభలు పూర్తిచేశామని, రూ.9.34 కోట్లతో 153 అభివృద్ధి పనులకు ఆమోదం పొందినట్లు వివరించారు.

మద్యం దుకాణాలకు ఇతర రాష్ట్రాల వారూ అర్హులే



నగరి: రికార్డులు పరిశీలిస్తున్న డీసీ విజయశేఖర్

నగరి, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి సరిహద్దులోని ఇతర రాష్ట్రాల వారు కూడా అర్హులేనని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన గురువారం తనిఖీ చేసి ఆపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దుకాణాల కేటాయింపు తర్వాత కట్టాల్సిన కిస్తీ ఆరు కంతుల్లో కట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నగరి నియోజకవర్గంలోని నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో 11 దుకాణాలకు మొత్తం 160 దరఖాస్తులు వచ్చాయని, తమిళనాడు నుంచి కూడా ఆసక్తి చూపుతున్నారన్నారు. ఏ రాష్ట్రానికి చెందిన వారైనా అర్హులేనని, ఒకరికి ఎన్ని దుకాణాలు వచ్చినా కేటాయిస్తారన్నారు. **కార్వేటినగరం:** నూతన మద్యం దుకాణాలకు మంచి స్పందన లభిస్తోందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ అన్నారు. ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, ఎస్సైలు శ్రావణ్‌తేజ, మోసెస్ ఉన్నారు.



● సంతపేటలోని జీజేఎం హాల్‌లో నవచండీదేవి అలంకరణ ● కలెక్టరేట్: మహిషాసురమర్దనిగా పొన్నియమ్మన్ అమ్మవారు ● పుత్తూరు: శ్రీకామాక్షీదేవి అలంకరణలో శ్రీద్రౌపదీ దేవి ● నగరి: దుర్గాదేవి అలంకరణలో దేశమ్మ ● నగరి: కాళి అవతారంతో కామాక్షీదేవి ● కలెక్టరేట్: శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు



గుడిపాల: కందగిరి కొండపై ఆలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

చండీదేవి.. అభయ ప్రదాయిని

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలు చిత్తూరు నగరంలోని ఆలయాల్లో గురువారం వైభవంగా సాగుతున్నాయి. సంతపేటలోని జీజేఎం సుఖీభవ హాల్‌లో ఎనిమిదో రోజున జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ సతీమణి ప్రతిమ పాల్గొన్నారు.



పుత్తూరు: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో చండీ యాగం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



● చిత్తూరు గ్రామీణ: బీఎన్‌ఆర్‌పేటలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు ● కలెక్టరేట్: కట్టమంచిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో దుర్గాదేవి అలంకరణ ● ఐరాల: కాళికాదేవి అలంకరణలో పాలేటి గంగమ్మ ● కార్వేటినగరం.. దుర్గాదేవి అలంకరణలో బంగారమ్మ ● తవణంపల్లె: దిగువమాఘంలో దుర్గాదేవి అలంకరణలో అన్నపూర్ణాదేవి ● జీడీనెల్లూరు: దుర్గాదేవిగా అల్లియల్లమ్మ ● జీడీనెల్లూరు: వేపంజేరిలో హనుమంత వాహనంపై లక్ష్మీనారాయణస్వామి ● పెనుమూరు: సి.రామాపురంలో దుర్గాదేవిగా..

ఒత్తిడికి దూరంగా ఉండండి



ర్యాలీగా వెళ్తున్న అధికారులు, విద్యార్థులు

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసే వారందరూ ఒత్తిడికి దూరంగా ఉంటూ ఆరోగ్యంగా ఉండాలని ఎన్‌సీడీ కో-ఆర్డినేటర్ శిరీష తెలిపారు. ప్రపంచ మానసిక దినోత్సవం అవగాహన ర్యాలీని అధికారులతో కలిసి చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగం చేసే ప్రతిచోట ఒత్తిడి ఉంటుందని, వాటిని ఓపికతో తెలివిగా అధిగమించాలన్నారు. ఒత్తిడిని ఎదుర్కొనే ఉద్యోగులు ధ్యానం, యోగా, వ్యాయామం అలవాటు చేసుకుని, సమయ పాలన పాటించాలని, దీంతో ఒత్తిడికి దూరంగా ఉండొచ్చన్నారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరగడానికి మానసిక ఆరోగ్య విద్యను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం అపోలో కళాశాల విద్యార్థులతో కలిసి గాంధీ విగ్రహ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు భానుశేఖర్‌రెడ్డి, నరేష్, రామ్‌గోపాల్, శ్రీవాణి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రతన్‌టాటా మృతి తీరని లోటు



పుత్తూరు: రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు

పుత్తూరు, న్యూస్‌టుడే: భారతీయ పారిశ్రామిక రంగంలో ఒక వెలుగు వెలిగిన రతన్‌టాటా మరణం దేశ పారిశ్రామిక రంగానికి తీరని లోటని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు అన్నారు. పట్టణంలో గురువారం తన కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి నివాళి అర్పించారు. పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు, తెదేపా రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి ధనపాల్, నాయకులు బాలాజీనాయుడు, మణికంఠ, విజయ్‌చౌదరి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **పెనుమూరు:** పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతి బాధాకరమని మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ఆయన చేసిన అభివృద్ధి అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. సామాజిక సేవలో ఆయన భాగస్వామ్యం మరువలేనిదన్నారు.

13, 14న కబడ్డీ టోర్నమెంట్

పాలసముద్రం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 53వ కబడ్డీ టోర్నమెంట్ పోటీలు పాలసముద్రం దళితవాడలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు గురువారం తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కబడ్డీ పోటీలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడు, నాలుగు బహుమతుల కింద రూ.15 వేలు, రూ.10వేలు నగదు అందజేయనున్నామని ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్త క్రీడాకారులు సహా సమీప తమిళనాడు క్రీడాకారులు సైతం అర్హులని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా నిరాశ్రయుల దినోత్సవం



నిరాశ్రయులకు దుస్తులు అందిస్తున్న దాతలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: స్థానిక నగరపాలక సంస్థ పట్టణ పేదల రాత్రి వసతిగృహంలో నిరాశ్రయుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్, కేశవరెడ్డి స్మారక ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, వసతిగృహ ఇన్‌ఛార్జి జోసఫ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో కమ్ముకున్న మేఘాలు

మేఘం కమ్మి.. వర్షం కురిసి

చిత్తూరు నగరంలో గురువారం ఉదయం మేఘాలు కమ్ముకుని ఉన్న పళంగా వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా పరుగులు తీశారు. సాయంత్రం కట్టమంచి చెరువు పరిసర ప్రాంతాల్లో కమ్ముకున్న మేఘాలతో పాదచారులు ఆహ్లాదం పొందారు. **-ఈనాడు, చిత్తూరు**

బాధితుడికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న యుగంధర్

పెనుమూరు, న్యూస్‌టుడే: సామిరెడ్డిపల్లె యానాది కాలనీకి చెందిన అజయ్ గత నెలలో మిద్దె పైనుంచి ప్రమాదవశాత్తూ కిందపడి గాయపడ్డాడు. మంచానికే పరిమితమైన అతడిని గురువారం నియోజకవర్గ జనసేన బాధ్యుడు యుగంధర్ పరామర్శించారు. అతడికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నాయకులు శ్రీనివాసులు, రేణుక, బాలాజీ, రాఘవ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంతి.. ఆర్థిక ప్రగతి

- బ్యాంకు రుణాలతో అభివృద్ధి
- కుటుంబాలకు అండగా మహిళలు

న్యూస్‌టుడే, పుత్తూరు

గతంలో మహిళలు వంట పనులు ముగించుకున్నాక చిన్నాచితకా పనులు చేసి తమ అవసరాలకు సరిపడా సంపాదించుకునేవారు.. నేడు ఆ పరిస్థితి నుంచి ఆర్థికంగా ఎదిగే దిశగా ఆలోచన చేసి ఆర్థికంగా స్థిరపడుతున్నారు.. తమకు నచ్చిన, తెలిసిన పనుల్లో మెళకువలు నేర్చుకుని వ్యాపారాలు చేసి రూ.వేలు ఆర్జించి ఆర్థిక ప్రగతి దిశగా సాగుతున్నారు.. ఎదుటి వారికి అప్పులిచ్చే స్థాయికి ఎదిగారు. . రాస్ సహకారంతో తమ పొదుపు సొమ్ముతో బ్యాంకు రుణాలు పొంది వ్యాపారాలు విస్తరించి పదిమందికీ ఆదర్శంగా నిలిచారు పుత్తూరు పట్టణానికి చెందిన పలువురు మహిళలు.

చేటల అల్లికతో..



పట్టణంలోని గేటుపుత్తూరుకు చెందిన భార్యభర్తలు శాంతి, వాసు చేటల అల్లికతో జీవిస్తున్నారు. వెదురు కోసం బయట అధిక వడ్డీకి చేసిన అప్పులు తీర్చేందుకు వచ్చే సంపాదన సరిపోయేదికాదు. దీంతో శాంతి రాస్ స్వయం సహాయక సంఘంలో చేరి ఆర్నెల్లు పొదుపు చేశారు. బ్యాంకు ద్వారా రూ.లక్ష రుణం తీసుకుని ఎవరిపై ఆధార పడకుండా తమ పనులు తామే చేసుకుంటున్నారు. నెలకు రూ. 20 వేలు ఆదాయం వస్తోందని, రుణం సకాలంలో చెల్లిస్తుండటంతో మళ్లీ అధికారులు రుణాలు ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యాపారం పెరిగి ఆర్థిక పరిస్థితి మెరుగైందని శాంతి తెలిపారు.

బుట్టల తయారీతో..



గేటుపుత్తూరులోని రమేష్, చిన్న భార్యభర్తలు. వీరు బుట్టల అల్లికల ద్వారా వచ్చే ఆదాయంతో జీవించేవారు. వెదురు తెచ్చుకునేందుకు బయట తీసుకునే అప్పు సరిపోయేదికాదు. చేసిన అప్పులకు వడ్డీ కట్టలేక ఇబ్బందిగా ఉండేది. తయారుచేసిన వస్తువులు స్థానికంగా విక్రయించి జీవిస్తున్నారు. రాస్ స్వయం సహాయక సంఘంలో చేరి బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకుని వ్యాపారాన్ని విస్తరించి ఆర్థికంగా స్థిరపడ్డారు. సకాలంలో రుణం చెల్లించడంతో పాటు అన్ని ఖర్చులు పోను నెలకు రూ.15 వేలు సంపాదిస్తున్నామని చిన్నా పేర్కొన్నారు.

వస్త్రాలు నేసి..



నారాయణవనానికి చెందిన ఏకాంబరం, దుర్గ భార్యభర్తలు, గతంలో భర్త మాత్రమే చేనేత కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. దీంతో దుర్గ స్వయం సహాయ సంఘంలో చేరి పొదుపు ప్రారంభించారు. తద్వారా బ్యాంకులో రుణం తీసుకుని మరమగ్గాలు ఏర్పాటు చేసుకున్నారు. పనిభారం తగ్గడంతో పాటు ఇద్దరూ సమష్టిగా పనులు చేసుకోవడం ద్వారా నేడు ఆర్థిక పరిస్థితి మెరుగైంది. నెలకు రూ.15వేలు ఆదాయం వస్తోందని దుర్గ పేర్కొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

తవణంపల్లె: ఎగువ మత్యం దళితవాడకు చెందిన భాస్కర్(58) పశువులకు గడ్డి కోసుకు రావడానికి బుధవారం సాయంత్రం ఎం.గొల్లపల్లి సమీప పొలానికి వెళ్లి ఇంటికి రాలేదు. గురువారం కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా గట్టుపై మృతి చెందినట్లు గుర్తించారు. భార్య శకుంతల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ద్విచక్ర వాహనాల ఢీ.. శ్రీరంగరాజపురం: కారు, రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు గాయపడిన సంఘటన సానాకుప్పం రోడ్డు వద్ద గురువారం జరిగింది. నెలవాయికి చెందిన మధు కారులో పళ్లిపట్టుకు వెళ్తున్నాడు. సానాకుప్పం రోడ్డు మలుపు వద్ద చెరకు ట్రాక్టర్‌ను తప్పించబోయి ఎదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో దిగువ ముద్దికుప్పం గ్రామానికి చెందిన దొరబాబు, నెలవాయి కొత్తఇండ్లుకు చెందిన మధు, తిరుమల, చంద్ర గాయపడ్డారు. వారిని 108 వాహనంలో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్తు సర్వీసుకు నోచని బోరు

మూడేళ్లుగా తాగునీటికి తిప్పలు



విద్యుత్తు సర్వీసుకు నోచుకోక నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరు



అలంకారప్రాయంగా తాగునీటి ట్యాంకు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: గుండ్లకట్టమంచి దళితవాడ ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చేందుకు మూడేళ్ల కిందట నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ తాగునీటి పథకం కింద రూ.16 లక్షలతో తాగునీటి బోరు వేశారు. నీరు పుష్కలంగా రావడంతో మోటారు అమర్చారు. తాగునీటి సరఫరాకు 40 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మించారు. బోరు మోటారుకు విద్యుత్తు సర్వీసు కోసం రూ.2.5 లక్షలు చెల్లించారు. అయితే విద్యుత్తుశాఖ అధికారులు సర్వీసు ఇవ్వకపోవడంతో మూడేళ్లుగా బోరు నిరుపయోగంగా ఉంది. గత ప్రభుత్వం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అప్పటి ఎమ్మెల్యే బాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సేతుమాధవ్‌ను వివరణ కోరగా.. తాను వారం రోజులు కిందట బాధ్యతలు చేపట్టానని, సమస్య పరిశీలించి వారం రోజుల్లో పరిష్కరిస్తానని తెలిపారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

పండ్లు, మిఠాయిల వితరణ



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రిమ్మర్స్ పాఠశాలలో ప్రత్యేక ప్రతిభావంతులకు పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మెంటల్ హెల్త్‌డే సందర్భంగా గురువారం పలువురు న్యాయవాదులు వాటిని పాఠశాల సిబ్బందికి అందించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయవాదులు భాస్కర్, మహేశ్వరి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

భూమిపూజ

పుంగనూరు: పట్టణ పరిధిలోని మంగళం కాలనీలో గురువారం శుద్ధ జల కేంద్రానికి తెదేపా నాయకుడు సీవీరెడ్డి భూమి పూజ చేశారు. కాలనీ ప్రజలకు ఉచితంగా శుద్ధ జలం అందించడానికి దాత రాఘవ ముందుకు రావడం అభినందనీయమన్నారు. మాధవరెడ్డి, నానబాల కుమార్, విరూపాక్షి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:

సమస్య: బైరెడ్డిపల్లె-కడపనత్తం మార్గంలో రోడ్డు ధ్వంసమైంది. పాతపేట, పాతూరునత్తం గ్రామాల వద్ద గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరమ్మతులు చేసి ప్రజల కష్టాలు తీర్చాలి.

- స్థానికులు

సమాధానం: వెంటనే పరిశీలించి మరమ్మతులకు చర్యలు చేపడతాం.

- ఆదికేశవులు, ఆర్‌అండ్‌బీ ఏఈ, పలమనేరు

సదుం, న్యూస్‌టుడే:

సమస్య: స్థానిక కాలేజీ రోడ్డులో తాగునీటి గొట్టాలు మరమ్మతులకు గురయ్యాయి. తరచూ నీరు వృథా అవుతుంది. రోడ్డంతా నీళ్లతో గుంతలు పడుతున్నాయి.

- స్థానికులు

సమాధానం: వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపడతాం. **- హసీనా, పంచాయతీ కార్యదర్శి, సదుం**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పురపాలిక పరిధి తంబిగానిపల్లె కాలనీలో రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కాలువ లేక పోవడంతో ఇళ్ల మధ్యలో నిల్వ ఉంటూ దోమలకు ఆవాసాలుగా మారాయి.

- వేలు, స్థానికుడు

సమాధానం: మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. కాల్వలకు ప్రతిపాదనలు పంపాం.

- శ్రీనివాసరావు, పుర కమిషనర్

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు: ఎమ్మెల్యే



డ్రైవర్స్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, పలమనేరు: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పట్టాలు, పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం డ్రైవర్స్ కాలనీలో ఆయన పర్యటించారు. ఇళ్ల పట్టాల విషయమై ఇరువర్గాల ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న ఆయన అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో కొంత మంది స్థానికులు ఇష్టానుసారంగా ఇంటి పట్టాలు సొంతం చేసుకొని వాటిని ఇప్పటికి విక్రయిస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దారు శివకుమార్‌ను కాలనీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచి మురళి పాల్గొన్నారు. ❖ మేలుమాయి క్రాస్, పలమనేరులో అమ్మవారిని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయవాది గంగయ్యనాయుడిని ఎమ్మెల్యే కలిశారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌కు సత్కారం

శాంతిపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ వైస్ ఛైర్మన్, కుప్పం తెదేపా ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నంను రాళ్లబూదుగూరు క్లస్టర్ నాయకులు మణి, బసవరాజు, జయరాజ్, కుమార్, రామేగౌడు తదితరులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను ఘనంగా సత్కరించారు. కుప్పం- గెసికపల్లె, రాళ్లబూదుగూరు మార్గాల్లో అంతర్రాష్ట్ర ఆర్టీసీ అదనపు సర్వీసులు నడపాలని విన్నవించారు.

చెరువుల్లో మట్టి..

◆ ఇష్టారాజ్యంగా యంత్రాలతో తవ్వకాలు
◆ రూపు కోల్పోతున్న జల వనరులు

యథేచ్ఛగా కొల్లగొట్టి..!



◆ శాంతిపురం మండలం మొరసనపల్లె చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపట్టిన తర్వాత దుస్థితి ఇది. మండల కేంద్రానికి 2 కిలోమీటర్ల దూరంలో.. కుప్పం- పలమనేరు జాతీయ రహదారి పక్కన చెరువులో వారం రోజులుగా యంత్రాలతో మట్టి తవ్వకాలు సాగిస్తున్నా అధికారులు అటువైపు చూడలేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.



◆ కుప్పం పట్టణ పరిధిలోని పాతపేట చెరువులో నెలల తరబడి మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో వాణిజ్య స్థలాల చదును కోసం రియల్టర్లు యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడంతో చెరువు రూపు కోల్పోయింది. దాదాపు 30 అడుగుల లోతు మట్టి తోడేశారు. యంత్రాలతో అడ్డదిడ్డంగా మట్టి తవ్వకాల వల్ల చెరువు హద్దులు చెరిగిపోయి ఆక్రమణల పాలవుతోందని స్థానికులు చెబుతున్నారు.

కుప్పం, న్యూస్‌టుడే: కుప్పం మున్సిపాలిటీ తోపాటు గ్రామీణ, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో జలవనరులు మట్టి మాఫియాకు అడ్డాగా మారాయి. ఐదేళ్ల వైకాపా పాలనలో రాజకీయ పలుకుబడితో పెట్రేగిపోయిన రియల్టర్లు ప్రస్తుతం కూటమి పాలనలోనూ దర్జాగా తవ్వకాలు సాగిస్తున్నారు. కుప్పం పట్టణం తోపాటు మండల కేంద్రాలకు సమీపంలోని చెరువులు, కుంటల్లో దందా సాగుతుంది.

వాణిజ్య స్థలాల చదునుకు..

నాలుగు మండలాల్లో జాతీయ రహదారితో పాటు పలు గ్రామీణ మార్గాలకు ఇరువైపులా భూముల విలువలకు రెక్కలొచ్చాయి. సేద్యపు భూములను వాణిజ్య స్థలాలుగా చదును చేసేందుకు అవసరమైన మట్టి జలవనరుల్లో తోడేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నాయకుల అండ, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు సాగిస్తున్నారు. ప్రధానంగా కుప్పం పట్టణం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లెలో లేఔట్ స్థలాల అభివృద్ధి కోసం వేలాది ట్రాక్టర్ లోడ్ల మట్టి చెరువులు, కుంటల్లో తవ్వి తరలిస్తున్నారు.

జల వనరుల కట్టల బలహీనం

గడచిన రెండేళ్లుగా వర్షాభావం వల్ల జలవనరుల్లో నీటి వసతి లేకపోవడం మట్టి వ్యాపారులకు వరంలా మారింది. నెలల తరబడి యంత్రాలతో మట్టి పెకలిస్తున్నందున చెరువులు, కుంటల కట్టలు బలహీన పడుతున్నాయి. కట్టలు, మొరవలను ఆనుకొని మట్టిని తవ్వడంతోనే ఇలాంటి పరిస్థితి వచ్చిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడేళ్ల కిందట తెదేపా పాలనలో జలవనరుల్లో ఆక్రమణలు తొలగించడం తోపాటు చుట్టూ తవ్వించిన కందకాలు మట్టి తవ్వకాల వల్ల ఆనవాళ్లు కోల్పోయాయి.

మట్టి తవ్వకాలు అరికడతాం

నియోజకవర్గంలో జలవనరుల తోపాటు ప్రభుత్వ స్థలాల్లో మట్టి అక్రమ తవ్వకాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఆయా మండలాల్లో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ద్వారా నిఘా ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాసరాజు, ఆర్డీఓ కుప్పం

వీధి దీపం ఏర్పాటు

స్పందనకు వందనం

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయ సమీపంలో పురపాలక అధికారులు వీధి దీపం ఏర్పాటు చేశారు. ఈనెల 9న మేమున్నాం మీకు తోడుగాలో ప్రచురితమైన సమస్యకు అధికారులు స్పందించారు. పుర కమిషనరు మధుసూదనరెడ్డి స్పందించి వీధిదీపం ఏర్పాటు చేయించారు.

రహదారి గుంత.. తీరని చింత



ప్రధాన రహదారి రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందులు పెట్టేలా తయారైంది. కుప్పం రైల్వే స్టేషన్ కూడలి నుంచి గత వైకాపా ప్రభుత్వంలో సీఎం పర్యటన సందర్భంగా ఇరువైపులా ఏర్పాటు చేసిన బారికేడ్లకు గుంతలు తవ్వారు. వాటిని నామమాత్రంగా పూడ్చారు. వీటితో పాటు కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైనా రోడ్డు మరమ్మతులు చేసి ఏళ్లు కావడంతో గుంతలమయంగా మారింది. గాంధీ విగ్రహం కూడలి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత అధికారులకు కనిపించక పోవడంతో వాహనచోదకులకు ప్రమాదానికి గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ దస్తగిరి వివరణ కోరగా, రోడ్డుకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కుప్పం, న్యూస్‌టుడే: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఖాయమని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణారావు, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎన్‌కే సుబ్రహ్మణ్య సూచించారు. గురువారం కళాశాలలో ర్యాగింగ్ నివారణ, లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సమావేశంలో వారు ప్రసంగించారు. ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తు అంధకారం చేసుకోవద్దని కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. ర్యాగింగ్, లైంగిక వేధింపుల చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ అభిరామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ క్రిష్ణారావు

విద్యుత్తు వెలుగులు.. మురుగు పరుగులు



పట్టణ ప్రధాన రహదారిలో స్తంభాల అలంకరించిన విద్యుత్తు లైట్లు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలో సుందరీకరణలో భాగంగా విద్యుత్తు స్తంభాలను సుందరంగా అలంకరించి ఆకట్టుకునేలా దీపాలు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి నేతాజీ రోడ్డు, శాంతినగర్, ప్యాలెస్ రోడ్డు ప్రాంతాల్లోని వీధి దీపాలను సుందరంగా అలంకరించారు. వీటితో పాటు ఏళ్లుగా చెత్తాచెదారం, మట్టి పేరుకుపోయి వర్షం కురిస్తే మురుగు రోడ్లపై ప్రవహించేలా తయారైంది. గురువారం మురుగునీటి కాలువల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

భూగర్భ జలాల సంరక్షణే లక్ష్యం



నూతన ఛైర్మన్ ప్రభాకర్‌ను సన్మానించిన అధికారులు

కల్లూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, పేద రైతుల ఆదాయాన్ని వృద్ధి చేయడమే వాటర్‌షెడ్ లక్ష్యమని ప్రాజెక్టు అధికారిణి తేజస్విని తెలిపారు. మంగళంపేట ఛైర్మన్‌గా ప్రభాకర్, కో-ఆప్షన్ ఛైర్మన్‌గా సునీతను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక సర్పంచి మధు, తెదేపా నాయకులు వారిని సన్మానించారు.

PUNGANUR MUNICIPALITY
e-procurement Short Tender Notice
Roc.No:85/2024/E1, Dt: 10-10-2024
NIT No: 07 to 10/2024-25

1. No.of Works	: 04 Nos
2. ECV Amount	: Rs. 13.14 Lakhs
3. Bid Document Downloading Starting Date	: 10-10-2024 at 05.00 P.M
4. Bid Document Downloading End Date	: 16-10-2024 at 03.30 P.M
5. Bid Submission Closing Date	: 16-10-2024 at 04.30 P.M
6. Commercial Bid Opening Date	: 16-10-2024 at 04.31 P.M
Name and Address of the Concerned Officer	: Commissioner, Punganur Municipality Cell: 9849905868

Further details can be seen at e-procurement market place at https://tender.apeprocurement.gov.in from 10-10-2024 at 05.00 P.M

Sd/- Commissioner, Punganur Municipality

నేడు విగ్రహ ప్రతిష్ఠ

బైరెడ్డిపల్లె: ఎం.కొత్తూరులో నూతనంగా నిర్మించిన శ్రీనడివీధిగంగమ్మ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు గురువారం తెలిపారు.



పుంగనూరు: మహిసాసుర మర్దనిగా ❖ పుంగనూరు: అన్నపూర్ణాదేవి ❖ పుంగనూరు: శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటరమణస్వామి ❖ కందూరు: కేసరి అలంకరణలో ❖ బైరెడ్డిపల్లెలో దుర్గాదేవిగా ❖ సదుం: దుర్గాదేవి అలంకరణలో ❖ పెద్దపంజాణి: శ్రీరామాపురంలో

అమ్మ అలంకారం.. దేదీప్యమానం



వి.కోటలో కలశాలతో మహిళల ర్యాలీ

న్యూస్‌టుడే, బృందం: దేవీ శరవన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పుంగనూరు, కుప్పం, పలమనేరు పట్టణాల్లోని అమ్మవారి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అంలకరణలు చేశారు. మండలాల పరిధిలోని గ్రామ దేవతలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి దర్శించుకున్నారు.

అంతర్రాష్ట్ర రహదారి పనుల కోసం పరిశీలన

రామకుప్పం, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి నుంచి మరుగున పడిపోయిన రామకుప్పం మండలం 89పెద్దూరు- తమిళనాడులోని ఆంబూరు వరకు అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణ పనుల కోసం గురువారం అధికారులు పరిశీలించారు. వైకాపా ప్రభుత్వం ఆ పనులు విస్మరించింది. కూటమి ప్రభుత్వం రాగానే స్థానిక నాయకులు ఎమ్మెల్సీ కంచర్ల, ఆనందరెడ్డి, మునస్వామి, ఆంజనేయరెడ్డి, మనోహర్ తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో గురువారం ముళ్లకంపతో నిండిన పాతదారిని అటవీ, పీఆర్ అధికారులు పరిశీలించారు. నివేదిక తయారు చేసి పంపనున్నట్లు వివరించారు. కుప్పం రేంజర్ జయశంకర్, పీఆర్ ఏఈ మహదేవనాయుడు, తహసీల్దారు బాబు పాల్గొన్నారు.



ప్రతిపాదన రహదారిని పరిశీలిస్తున్న అటవీ, రెవెన్యూ, పీఆర్ అధికారులు

రతన్‌టాటాకు ఘన నివాళి

పలమనేరు, కుప్పం, కల్లూరు: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణం ఆ రంగానికి తీరని లోటని వక్తలు అన్నారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కల్లూరులో లయన్స్ క్లబ్ కార్యాలయంలో, కుప్పం పీఈఎస్ వైద్యశాల వద్ద యువత, పలమనేరులో వివిధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు.



పలమనేరు: నివాళులు అర్పిస్తున్న పట్టణవాసులు



కల్లూరు: లయన్స్‌క్లబ్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏనుగుల దాడిలో వరికి నష్టం

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాళెం, తుడుంవారిపల్లె గ్రామాల సమీపంలోని వ్యవసాయ పొలాలపై ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. చలపతి, బుజ్జమ్మ అనే ఇద్దరు రైతుల వరి పైరును తొక్కి వేయడంతో పాటు సోము అనే రైతు పొలంలోని అర ఎకరా టమాటాను ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవళంపేట పంచాయతీ మునిరెడ్డిగారిపల్లెకు చెందిన అమర్‌నాథ్‌రెడ్డికి చెందిన ఎకరా వరి పూర్తిగా నాశనం చేశారు. ఘటనాస్థలిని కల్లూరు సీఐ సూర్యనారాయణ, అటవీ అధికారి మున్నా పరిశీలించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

సోమల, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం తరుచుగా వేధిస్తున్న భర్త, అత్త, మామ, ఆడబిడ్డపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేష్ తెలిపారు. సోమలకు చెందిన శ్రీరాములు కుమార్తె సుజాతను చిత్తూరుకు చెందిన రాధకృష్ణమూర్తి కుమారుడు శ్రీధర్‌కిచ్చి 2012లో వివాహం చేశారు. వీరికి కవలపిల్లలు ఉన్నారు. రూ.6 లక్షలు నగదు తీసుకురావాలని వేధిస్తున్నారని సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త శ్రీధర్, అత్త ఆదిలక్ష్మీ, మామ రాధకృష్ణమూర్తి, ఆడబిడ్డ శోభలపై కేసు నమోదైంది.

మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పెద్దపంజాణి మండలం పెద్దవెలగటూరు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన నాగమణి కుమార్తె శ్రీ బిందు (20) మనస్తాపంతో పురుగు మందు తాగారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

వైభవంగా గరుడోత్సవం



బైరెడ్డిపల్లె: తీర్థం గ్రామంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాల్లో గురువారం గరుడోత్సవం వైభవంగా జరిగింది. సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి బాణవేడుకలు, బ్యాండు వాయిద్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు.

తీర్థంలో గరుడ వాహనంపై సీతా సమేత శ్రీరామచంద్రస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఆర్టీసీకి రూ.16.79 లక్షల ఆదాయం.. పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో ఈ నెల 8న నడిపిన బస్సుల ద్వారా రూ.16.79 లక్షల ఆదాయం వచ్చిందని డీఎం సుధాకరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దసరా సెలవులు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు, గరుడోత్సవం సందర్భంగా పుంగనూరు నుంచి తిరుపతి, చెన్నై, బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్‌కు బస్సులు నడిపామన్నారు.

సీసీ పనుల పరిశీలన.. గుడుపల్లె: ఉపాధి నిధులతో మండలంలో రూ.5.28కోట్ల విలువైన పనులు చేపడుతున్నట్లు పీఆర్ ఏఈ మూర్తి మురళి తెలిపారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం కాడేపల్లె శివాలయం వద్ద జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. అంతకు ముందు పనులను తెదేపా నాయకులు పనులు ప్రారంభించారు.

రాయితీ ధరకే వంటనూనెల విక్రయం



నూనె ప్యాకెట్ విక్రయిస్తున్న రెవెన్యూ అధికారులు

పలమనేరు, న్యూస్‌టుడే: రాయితీ ధరలకు వంటనూనెల విక్రయ కేంద్రాన్ని రెవెన్యూ అధికారులు పట్టణంలో గురువారం ప్రారంభించారు. తహసీల్దారు ఇన్బనాథన్ ఆధ్వర్యంలో విక్రయాలు మొదలు పెట్టారు. బజారువీధిలోని ఓ దుకాణంలో లీటరు సన్‌ఫ్లవర్ నూనె ప్యాకెట్ రూ.129 విక్రయించే కౌంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.